క్లుప్తంగా

ఫిజియోథెరపీపై అవగాహన



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈఓ వెంకటేశ్

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హైదరాబాద్ నిజామ్స్ వారి ఆధ్వర్యంలో ఫిజియోథెరపీపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిజామ్స్ ప్రతినిధులు రమేష్, మహేష్ విద్యార్థులకు ఉపాధ్యాయులు ఫిజియోథెరపీ ఎలా నేర్పించాలో శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ వెంకటేశ్, ఐఈఆర్టీ సాంబశివరావు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

18న నిరాహార దీక్ష

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని శ్రీధర్మ శాస్తా ఆలయం ఎదురుగా ఈనెల 18వ తేదీన నిరాహార దీక్ష చేపడుతున్నట్లు ఆలయ కార్యదర్శి కన్నెగంటి కృష్ణమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయానికి సంబంధించి సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ దీక్ష చేపడుతుండగా, భక్తులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. ఆలయం ఎదురుగా సింగరేణి సంస్థ చేడుతున్న నిర్మాణాలతో భక్తులు ఇబ్బంది ఎదురవుతుందని చెప్పినా స్పందించకపోవడంతో నిరవధిక దీక్షకు దిగుతున్నట్లు పేర్కొన్నారు.

జగ్గయ్య ఆశయాలను కొనసాగిస్తాం...



మాట్లాడుతున్న గుమ్మడి నరసయ్య

సుజాతనగర్: ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడిన కోరం జగ్గయ్య ఆశయాలను కొనసాగించాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా సీనియర్ నాయకుడు కామ్రేడ్ కోరం జగ్గయ్య సంస్మరణ సభను పాత అంజనాపురం గ్రామంలో మండల కార్యదర్శి బానోత్ ధర్మా అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గుమ్మడి మాట్లాడుతూ.. కామ్రేడ్ జగ్గయ్య ఉపాధి కూలీల సమస్యలు, గిట్టుబాటు ధరలపై తిరుగులేని పోరాటాలు చేశాడని కొనియాడారు.

సీతారాములుకు నివాళి

పాల్వంచ: అమరజీవి బరపటి సీతారాములు ఆశయాలు సాధించాలని సీపీఎం నాయకుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బరపటి సీతారాములు 16వ వర్ధంతి సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లోని స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్నవరపు కనకయ్య, కాసాని ఐలయ్య, మచ్చ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నరసింహారావు మృతిపై సంతాపం

జూలూరుపాడు: భేతాళపాడు గ్రామానికి చెందిన కిలారు నరసింహారావు రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందాడు. నరసింహారావు భౌతికాయాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, నర్వనేని పుల్లారావు, వేల్పుల నరసింహారావు, సాయిల కృష్ణయ్య, చలమల నరసింహారావు, తొండెపు సత్యనారాయణ, పుష్పాల నరసింహారావు, చౌడం లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, తదితరులు సందర్శించి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు.

మునుపటి ఫలితం

పునరావృతం కావొద్దు

- ఎంపీగా కవితను గెలిపిస్తే సమస్యల పరిష్కారం
- ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ మంత్రి సత్యవతి

ఇల్లెందు: మహబూబాబాద్ లోక్‌సభ స్థానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లేనందున, ఎంపీగా మాలోతు కవితను గెలిపిస్తే ప్రజల గొంతుకగా మారి సమస్యల పరిష్కారానికి పాటుపడతారని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. ఇల్లెందులో మంగళవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితం పునరావృతం కాకుండా అందరూ ఎంపీ అభ్యర్థి విజయానికి పాటుపడాలన్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడానికి ఇతరులు కారణంగా కాదని, యుద్ధం సరిగ్గా చేయక.. బీఆర్ఎస్‌లోని కొందరు తీరుతో ఓటమి పాలయ్యామని తెలిపారు. జన నేతలను గుర్తించకుండా, అడుగులకు మడుగులు ఒత్తే వారికి అపరిమితంగా అవకాశం కల్పించడంతోనే ఇలా జరిగిందన్నారు. ఇక ముందు అలా జరగకుండా చూసుకోవాలని, వైషమ్యాలు విడనాడి కలిసికట్టుగా పనిచేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. హామీలను



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత, పక్కన సత్యవతి, హరిప్రియ తదితరులు

అమలుచేయలేక కాంగ్రెస్ బోల్తా పడగా, రామాలయం పేరుతో బీజేపీ ఓట్లు దండుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యాన నిత్యం ప్రజలతో మమేకమయ్యే మాలోతు కవిత విజయానికి పాటుపడాలని కోరారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ కవిత విజయానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి కవిత మాట్లాడుతూ కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టేలా తనను గెలిపించి కానుకగా ఇద్దామని తెలిపారు. కష్టకాలంలో ఉన్న బీఆర్ఎస్‌ను గట్టెక్కించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని చెప్పారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా రైతుబంధు అందకపోగా.. రుణమాఫీ చేయలేదని విమర్శించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, మహబూబాబాద్ జెడ్పీ చైర్మన్ బిందు, నాయకులు శీలం రమేష్, పరుచూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించడం అభినందనీయం

పాల్వంచ: క్రీడల్లో విద్యుత్ ఉద్యోగులు తమ సత్తా చాటడం అభినందనీయం అని జెన్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ అన్నారు. ఇటీవల హర్యానా రాష్ట్రంలో జరిగిన ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ బోర్డ్ టోర్నమెంట్‌లో చెస్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, క్యారమ్స్‌లో ప్రతిభ కనబర్చి ట్రోఫీలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్ విద్యుత్ సౌధలో విజేతలైన క్రీడాకారులను సీఎండీ అభినందించారు. మాట్లాడుతూ... క్రీడాకారులకు తమ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.

సీఎండీని కలిసిన డిప్లొమా ఇంజనీర్స్..

సీఎండీ ఎస్ఏఎం రిజ్వీని పవర్ మంగళవారం డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు, చీఫ్ అడ్వైజర్ డి.వేణుగోపాల్, జోనల్ సెక్రటరీ శ్యాంసుందర్‌రావు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న సీఎండీ రిజ్వీ

వేతనాలు ఇప్పించండి..

కొత్తగూడెంటౌన్: మాకు అందాల్సిన వేతనాలు త్వరగా ఇప్పించాలని, అదేవిధంగా వేసవిసెలవులను వెంటనే ఇవ్వాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కొత్తగూడెం సీడీపీఓ సలోనకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం కొత్తగూడెం సీడీపీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోనెమణి ఆధ్వర్యంలోని బృందం సభ్యులు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోనెమణి మాట్లాడుతూ... ప్రతీనెల 5వ తేదీన రావాల్సిన వేతనాలు ఇప్పటి వరకు రాలేదని, ఈవెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి మా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రమీల, రూప, శ్రీదేవి, సరోజ, మంజుల, లత, సత్యవతి, శివకుమారి, లక్ష్మి, కనకమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు.

‘ఉపాధి’ సమస్యలు పరిష్కరించాలి



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఇల్లెందు(టేకులపల్లి): ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా నాయకుడు దుబాకుల ప్రసాద్, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా నాయకుడు ఎట్టి నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని బోడు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను నాయకుల బృందం పరిశీలించారు. కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పూనెం లక్ష్మయ్య, ఈసాల లాలయ్య, పూనెం రామచంద్రు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: కొలతతో సంబంధం లేకుండా ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.750 చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సారంగపాణి, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో మంగళవారం వారు సమావేశమయ్యారు. పని ప్రదేశంలో సౌకర్యాలపై కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేక కూలీలు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రను ప్రతీఒక్కరు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం

పాల్వంచరూరల్: భారతదేశ అభివృద్ధి నరేంద్రమోదీతోనే సాధ్యమవుతుందని బీజేపీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం స్థానిక పట్టణంలోని 84వ పోలింగ్ బూత్‌లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. చింతలచెరువు శ్రీనివాసరావు, శ్రీనివాసకుమార్, గంధం నాగేంద్రప్రసాద్, రంజిత్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించింది. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ ఆధ్వర్యంలో కాకర్ల, దుబ్బతండా, మొద్దులగూడెం, అనంతారం గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు గడగడపకు వెళ్లి విస్తృతంగా ప్రచారం చేశారు. కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి వినోద్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. రమేష్, సిరిపురపు ప్రసాద్, తెల్లం నరసింహారావు పాల్గొన్నారు.

కోదండ రామాలయం ముస్తాబు

కదిలించిన ‘సాక్షి’ కథనం



చలువ పందిరి వేస్తున్న యువకులు

ఇల్లెందురూరల్: ఆలయ దుస్థితికి తోడు సింగరేణి సంస్థ సహకారం కొరవడటంతో సింగరేణి సంస్థకు పురుడు పోసిన నవమి వేడుకలు సంస్థ చేత నిర్మించబడిన తొలి కార్మికవాడ 21పిట్ కోదండ రామాలయం. ఇక్కడ రెండేళ్లుగా శ్రీరామ నవమి ఉత్సవాలు నిలిచిపోయాయి. ఈ దుస్థితిపై ‘నల్ల నేలలో నవమి వేడుకలు చూస్తామా..’శీర్షికతో మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనంతో స్థానిక యువత స్పందించి కోదండ రామాలయంలో నవమి వేడుకల కొనసాగించాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. మాజీ సర్పంచ్ ధనసరి స్రవంతి సహకారం, గ్రామపంచాయతీ తోడ్పాటు, స్థానిక పెద్దల చేయూత.. కలిసిరావడంతో యువత ఉత్సాహంతో ఆలయానికి రంగులు వేయడంతోపాటు చలువ పందిరి నిర్మించారు. భక్తుల సౌకర్యార్థం టెంట్లు కూడా వేశారు. బుధవారం సంప్రదాయబద్ధంగా సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వేడుకలకు సింగరేణి ఉన్నతాధికారులను కూడా ఆహ్వానిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

విజిలెన్స్ వేధింపులు అరికట్టాలని వినతి



సీఎండీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల్లో భాగంగా పేర్ల మార్పిడితో పాటు పేరు, ఇంటిపేర్లలో చిన్నచిన్న తప్పిదాలను ఆసరాగా తీసుకుని విజిలెన్స్ విభాగం నుంచి ఎదురవుతున్న వేదింపులను అరికట్టాలని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి మాధవనాయక్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాధవనాయక్ మాట్లాడుతూ..

సింగరేణి రిక్రూట్‌మెంట్ పరీక్ష ప్రశ్నపత్రాలను ఇంగ్లిష్‌తో పాటు తెలుగులోనూ ముద్రించాలని, వారసత్వ ఉద్యోగాల్లో విజిలెన్స్ తనిఖీలపై దృష్టి సారించాలని కోరారు. అలాగే, వార్షిక లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించడంపై సీఎండీకి నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, నాయకులు జీవీ.కృష్ణారెడ్డి, బి.సుందర్‌రావు, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

పాల్వంచరూరల్: అమ్మ ఆదర్శ పాఠశాలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరాచారి ఆదేశించారు. పాండురంగాపురం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో మంగళవారం ఇగిరేషన్‌శాఖ అధికారులు, గ్రామసమాఖ్య సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం జరిగింది. హాజరైన డీఈఓ మాట్లాడుతూ.. పాండురంగాపురం హైస్కూల్‌లో మౌలిక వసతులకు రూ.9లక్షల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ నిధులను తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుదీకరణ వంటి పనులకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, ఎంఈఓ శ్రీరామ్మూర్తి, హెచ్ఎం ఉత్తర కుమారి, ఎంపీఓ బి.నారాయణ, డీఈఓలు రాణి, చంద్రశేఖర్, మురళి, ఏఈలు నీలావతి, చంద్రశేఖర్, ఊర్మిళ, సరస్వతి, ఏపీఎం రాంబాబు, ఏపీఓ పోరండ్ల రంగా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీటీసీకి గాయాలు

జూలూరుపాడు: వెంగన్నపాలెం ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్‌రావు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చంద్రుగొండ రోడ్డులో మంగళవారం తెల్లవారుజామున ఆయనకు వాకింగ్‌కు వెళ్తుండగా ఆటో ఢీకొట్టడంతో తలకు స్వల్ప గాయాలు కావడంతో కొత్తగూడెంలో చికిత్స చేయించారు. ఈ మేరకు మధుసూదన్‌రావును వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ ఫోన్‌లో పరామర్శించారు.

కన్వేయన్స్ డ్రైవర్ మృతి



ప్రసాద్ (ఫైల్)

ఇల్లెందు: సింగరేణి జీఎం ఆఫీస్ కన్వేయన్స్ డ్రైవర్ కంప ప్రసాద్ (30) అనారోగ్యంతో మంగళవారం కొత్తగూడెం ఆస్పత్రిలో మృతి చెందాడు. బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన ప్రసాద్ ప్రజాపంథా మాస్‌లైన్ అనుబంధ ఇఫ్టూ కార్మిక సంఘంలో పని చేస్తున్నాడని, మృతి బాధాకరమని ఇఫ్టూ నాయకుడు యాకుబ్‌షావలీ తెలిపారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం



లీకైన నీటితో బురదమయం అయిన పాఠశాల ఆవరణ

ఇల్లెందు(టేకులపల్లి): మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో తాగునీటి పైపులు ఎప్పుడూ లీకవుతూనే ఉన్నాయి. పట్టించుకునేవారే లేరు. దాసుతండా పంచాయతీ సింగ్యా తండా ప్రాథమిక పాఠశాల పక్కనే మిషన్ భగీరథ పైపులైన్ లీకై పది రోజులు అవుతోంది. నీరంతా పాఠశాల ఆవరణలో నిల్వ ఉండడంతో బురదమయం. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు

పాల్వంచ: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్‌పై మంగళవారం కేసు నమోదు అయింది. పట్టణంలోని మొర్రేడు వాగు నుంచి ట్రాక్టర్‌తో ఇసుక అక్రమంగా రవాణా చేస్తుండటంతో ఎస్ఐ బి.రాము పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ సోయం ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు.

సంపత్‌కుమార్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న తల్లిదండ్రులు

పాల్వంచరూరల్: మండల పరిధి సూరారం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి జక్కుల సంపత్‌కుమార్ గతనెల 24వ తేదీన కిన్నెరసాని వాగులోని చెక్‌డ్యామ్‌లో పడి మృతి చెందడంపై పలు అనుమానాలు ఉన్నాయి. సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని మృతుడి తల్లిదండ్రులు జక్కుల శేఖర్, నాగలక్ష్మి కోరుతున్నారు. ఈ మేరకు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సంపత్ మెడపైన, చెవి వద్ద కమిలినట్లుగా ఉండటం, చెక్‌డ్యామ్ వద్ద దుస్తులు చిరిగి ఉండటంతో మృతిపై అనుమానాలు ఉన్నట్లు వాపోయారు. మా కొడుకు ప్రమాదవశాత్తు చనిపోలేదని హత్యకు గురై ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్‌లో సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. స్నేహితులు డి.సాయికుమార్, నందీశ్వర్‌రెడ్డి, ఎం.వేణులపై అనుమానం ఉందని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

సీతారాముల కల్యాణం చూతము రండి..



పాల్వంచ: తలంబ్రాలు కలుపుతున్న భక్తులు



నేడు నవమి సందర్భంగా ఊరూరా శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా జరగనుంది. ఈ మేరకు రామాలయాలను ఆలయ కమిటీలు, ధర్మకర్త మండలి ఆధ్వర్యంలో షామియానాలు, చలువ పందిళ్లు, మామిడి తోరణాలు కట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దాతలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు, పానకం పంపిణీ, అన్నదాన కార్యక్రమాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: ఇల్లెందులపాడులో...



కొత్తగూడెంటౌన్: పాత కొత్తగూడెంలోని శ్రీసీతారామ దేవాలయం



సింగరేణి(కొత్తగూడెం): రామవరంలోని శ్రీగణేష్ ఆలయం వద్ద వేసిన టెంట్లు



సుజాతనగర్: ముస్తాబైన సర్వారంలోని శ్రీ సీతారామ దేవాలయం



ఇల్లెందురూరల్: కొమరారం రామాలయం